# అయ్యో పాపం!

తెల్లటి చెవర్లెట్ కారు మెత్తగా పడవలా వచ్చి, అయిదంతస్థుల భవనం ముందాగింది. వెంటనే డ్రైవరు సింగు కారుదిగి, డోరు తెరచి పట్టుకున్నాడు. రాజారావుగారు బరువుగా, భారంగా దిగేరు. మెల్లిగా మెట్లెక్కి హాలులోకి ప్రవేశించారు. రిసెప్షన్‌లో వున్న కుచలకుమారి లేచినిలబడి విష్ చేసింది.

కాని ఆయనందుకోలేదు. మెల్లిగా లిఫ్టువైపుగా నడిచారు. ఆయన రాక గమనించిన లిఫ్ట్‌బాయ్, వినయంగా ఎదురుచూస్తున్నాడు. ఆయన మెల్లిగా లిఫ్ట్‌లోకి ప్రవేశించారు. అది మెత్తగా పైకి ప్రాకి, ఐదో అంతస్థులో ఆగింది.

రాజారావుగారు బయటకొచ్చి తన చాంబర్‌వైపు మెల్లిగా కదిలారు. ఆయన లోనికి ప్రవేశించగానే, ఆయన సెక్రటరీ మాధవి గ్లాసుగోడ అవతల నించే విష్‌చేసింది.

కాని ఈసారికూడా ఆయన అందుకోక నీరసంగా, పరధ్యానంగా ఎక్సిక్యూటివ్ కుర్చీలో శరీరాన్ని పడేశారు.

డ్రైవర్ సింగు, రెసెప్షనిస్టు కుచల, లిఫ్ట్‌బాయ్, ఆయన సెక్రటరీ మాధవీ అందరూ అనుకున్నది ఒక్కటే–

బాస్ ఈరోజు నిర్లిప్తంగా, నిరుత్సాహంగా ఆదోలా వున్నాడని.

కాని కారణమేమిటో వాళ్ళకి తెలీదు.

రాజారావుగారలా డల్‌గా, అదోలా వుండటానికిక్కారణం– గతరాత్రి ఆయనికి నిద్రలేదు– అంటే దానర్థం సుషుప్తిగా నిద్రపోలేదనికాదు. అస్సలు నిద్రపోలేదు. కనురెప్పలు మూతపడలేదు ఎవరో బలవంతాన రెప్పలు విడదీస్తునట్లు, అలాగే తెల్లవార్లూ మేకులాకూర్చుని, గడియారం గంట గంటకీ కొడుతున్న భయంకర గంటల శబ్దాన్ని వింటూ కాలక్షేపం చేశారు.

తెల్లవారేసరికి కళ్ళు మంటలు, బడలిక, నీరసం....

ఆయనికి నిద్రపట్టకపోయేటంత చేసే సమస్యలేం లేవు. అసలా మాటకొస్తే ఆయనికి సమస్యలేలేవు. ఆయన సమస్య విషసర్పాల బుసలు, కష్టాల కన్నీళ్ళు, నిరాశ అంచులు, అన్నీ జీవిత ప్రథామార్థంలోనే చవిచూసేరు. కృషి, పట్టుదల, కొండంత ఆశలను ఇంధనాలుగా వుపయోగించుకుని ప్రస్తుతస్థితికి చేరారు. కంట్రాక్టరు దగ్గర అకౌంటెంట్‌గా చేరిన రాజారావుగారు, కొంతకాలం తర్వాత, తనే స్వయానా కంట్రాక్టులు చేపట్టటం, వాటిల్లో వస్తున్న లాభాన్ని తెలివిగా మిగతావ్యాపారాల్లో మదుపుపెట్టడం– అక్కడా లాభాలు; డబ్బు.... డబ్బు... ఎటుచూసినా లాభాలు... పట్టిందల్లా బంగారం...

ఈరోజు రాజారావుగారికి అనేకరకాల వ్యాపారాలు, కంట్రాక్టులు, ఎరువులు, వ్యవసాయ పనిముట్ల తయారీ... ఆయనమీద ఆధారపడి కొన్ని వేల కుటుంబాలు బ్రతుకుతున్నాయి.

భార్య, ఒక్కడేకొడుకు, వాడికోభార్య, రాజభవనంలాంటి ఇంట్లో ఎవరి గది వారిది, ఎవరికారు వారిది, ఎవరి దినచర్య వారిది, అంతా యాంత్రిక జీవితం. ఒకళ్ళతో ఒకరికి సంబంధం వుండదు. అవుసరమూ వుండదు. వాళ్ళ యాంత్రిక జీవనంలో బటన్స్‌లాంటి వంటవాడు తోటమాలి, నౌకర్లు....

వాళ్ల యాంత్రిక బ్రతుకులకి చక్కటి ఉదాహరణ.

గతరాత్రి, రాజారావుగారికి నిద్రపట్టలేదన్న సంగతి,అందువల్ల ఈ రోజు నలతగా వున్నారన్న సంగతి, భార్య చారుమతికిగాని, కొడుకు సత్యప్రసాద్‌కి గాని, కోడలు లావణ్యకిగాని తెలీదు!

రాజారావుగారు తన ఛాంబర్లో కళ్ళుమూసుక్కూర్చొని, దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. ఆయన కప్పుడప్పుడూ ఆశ్చర్యమనిపిస్తుంది. కొన్నేళ్ళ క్రితం వరకు, తను లేకపోతే ఈ వ్యాపారాలెట్లా? ఈ వ్యవహారాలెట్లా? ఎవరు చూస్తారు? అని భయపడేవారు. కాని ఇపుడాస్థితిదాటిపోయి, వ్యవహారాలు, వ్యాపారాలు, ఆస్థులు, అయిశ్వర్యాలు, అన్నీ తనపరిధిదాటిపోయి, తను లేక పోయినా వాటివాటి పన్లు అవి వేళ ప్రకారం చేసేస్తూంటాయ్. తెల్లవాడు చెప్పినట్లు డబ్బుని నువు కొంతవరకే పెంచుతావ్– అటుతర్వాత నటిస్తావ్– నిజానికి అదే నిన్ను పెంచుతుంది. ఆ మాట అక్షరాలా నిజమైంది. ఆయన జీవితంలో.

ఇంటర్‌కమ్ 'బర్' మని మ్రోగడంతో కళ్ళుతెరచి వాస్తవంలో కొచ్చారు. వెంకటరత్నంనాయుడుగారొచ్చారు. మీతో మాట్లాడాలట" అంది మాధవి.

రాజారావుగారు ముక్తసరిగా "పంపించు" అన్నారు.

కొద్ది నిముషాల తర్వాత , నాయుడు మెత్తటి తివాసీపైన నడుచుకుంటూ వచ్చి రాజారావుగారి ముందున్న కుర్చీలో కూర్చున్నాడు అతడూ కంట్రాక్టరే అయినా రాజారావుకన్నా స్థాయి తక్కువ.

నాయుడు కూర్చున్న వెంటనే బ్రీఫ్‌లోంచి ఫైలు బయటకు తీసి రాజారావుకందిస్తూ, "మొన్న మనం అనుకున్నట్లుగా, అన్నీ ఎస్టిమేట్స్ వేయించి బ్లూ ప్రింట్స్ తయారు చేయించాను. నువుగూడా చూసి ఓ.కే. అంటే అయినట్లే. కోటిరూపాయల ప్రాజెక్టు- అంతా నీమీదే ఆధారపడుంది" అన్నాడు.

రాజారావుగారు స్థబ్దుగావిని వూరుకున్నాడు.

నాయుడికనుమానంవచ్చింది. 'ఏంటలా వున్నావ్- ఒంట్లో బాగాలేదా? రాజారావు ముక్తసరిగా 'రాత్రి నిద్రలేదు- బడలికగా వుంది' అన్నాడు. ఆనాసక్తిగా కళ్ళుమూసుకున్నాడు.

నాయుడు అతడి పరధ్యానాన్ని గమనించి 'సరే- నే వెళ్ళొస్తా- నాల్గు రోజుల తర్వాత మళ్ళీకలుస్తా ఈలోపున ఫైలు స్టడీచేసి, నీ నిర్ణయం తెలియజెయ్యి' అని వెళ్ళిపోబోతూ ఏదో గుర్తువచ్చినవాడిలా వెనకొచ్చి 'అన్నట్టు నిద్రరావటానికి మంచి ఉపాయం చెప్పనా?' అనడిగాడు.

రాజారావుగారి కళ్ళలో ఇంతక్రితం లేని ఉత్సాహం, ఆసక్తి. అది గమనించిన నాయుడు "సాయంత్రం ఇంటికెళ్ళి స్కాచ్ రెండు పెద్ద పెగ్గులు బిగించిపడుకో! ఎలా నిద్రరాదోచూస్తా" అనేసి గుబురుమీసాల వెనుక ముసిముసిగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. రాజారావుగారు ఆలోచనల్లో పడ్డారు.

ఇన్ని వ్యాపారాలు నడిపిస్తున్నా, లక్షలు కోట్లు గడించినా శ్రీమంతుడైనప్పటికి ఆయనకి ఏ దుర్వ్యసనాలూ అలవాటుకాకపోవటం విచిత్రంగా, విరుద్ధంగా అన్పిస్తుంది. ఆయన కనీసం సిగరెట్ కూడా త్రాగి ఎరుగరు. వ్యాపారరీత్యా, ఎంతోమందికి ఎన్నోసార్లు మందుపార్టీలిచ్చారు.కాని తానుమాత్రం కోక్‌త్రాగుతూ కూర్చుండేవారు.

కాని, ఈరోజు నిద్రకోసం నాయుడు త్రాగమనిచ్చిన సలహా ఆయన తేలిగ్గా త్రోసిపారెయ్యదల్చుకోలేదు.

సాయంత్రం వరకు ఆనాసక్తిగా, అసహనంగా గడిపేరు మధ్య మధ్య వచ్చే ఫోన్‌కాల్స్‌కి యాంత్రిక సమాధానాలు, అంతా వెల్తిగా, భారంగా, ఆలసటగా అన్పించింది.

సరిగ్గా అయిదు గంటలకి ఇంటికి బయలేద్దారు. ప్రతిరోజూ రాత్రి ఇంటికి చేరేసరికి తొమ్మిది, పది తక్కువకాదు.

దారిలో ఆలోచించారు. ఒక్కరాత్రి నిద్రలేనందువల్ల ఎందుకింత డీలా అయిపోయాను? నిజంగా తను నిద్రగురించేనా బాధపడేది. లేక తనక్కూడా తెలీకుండా లోలోపల గూడుకట్టుకున్న ఆశాంతివల్లా? లేక తను ఈ జీవితపు పరుగుతో అలసిపోయేడా?

కారు ఇంటిముందాగింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. పైనించి పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది.

నౌకరు హాల్లోనే ఎదురయి "అమ్మగారు క్లబ్బుకెళ్ళారండి, అబ్బాయి గారు పైగదిలో వున్నారండి" అని చెప్పాడు.

రాజారావు పైకెళ్ళాడు.

పైన మూడుగదులు వరుసగా, మొదటిది కొడుకుది. అటుతర్వాత తన భార్య చారుమతిది. చివరగా తనది.

రాజారావు తనగదివైపు వెళ్ళబోతూ, కొడుకు గదిముందు ఒక్కక్షణం ఆగేడు. లోపలినుంచి వినిపిస్తున్న పాశ్చాత్య సంగీతం వూపిరి తిప్పుకోనివ్వటం లేదు.తలుపులు దగ్గరగా వేసున్నాయ్.

ఆయన ఆ శబ్దానికి తట్టుకోలేక, మెల్లగా తలుపునెట్టాడు. సత్యప్రసాద్ సోఫాలో కాళ్ళుచాపుకుని కూర్చున్నాడు. అతడిముందు

ఒకగ్లాసు, దానిలో తేనెరంగుద్రవం. ప్రక్కన అందమైన సీసా, తినుబండారాలు, సిగిరెట్లు...

తండ్రినిచూచి ప్రసాద్ వులిక్కిపడ్డాడు. ఈ సమయంలో ఆయనొస్తాడని అనుకోకపోవటం అతడి తప్పుకాదు.

రాజారావుగారు కొడుకుని ఆ స్థితిలో చూసి ఆశ్చర్యపోయారు. బాధపడలేదు. కారణం, భార్య అంతకుముందేరెండుమూడు సందర్భాల్లో కొడుకు తాగుతున్నాడని చెప్పివుండటం వల్ల.

ఆయన మెల్లగా గది మధ్య కొచ్చాడు. వెళ్ళి టేప్‌కట్టేశాడు. గదిలో నిశ్శబ్దం.

ప్రసాద్ లేచి నుంచున్నాడు

రాజారావుగారికి అతడిని చూస్తే జాలేసింది. వాడికి జీవితంలో తపించటానికి, ఆరాటపడటానికి,ఆశపడటానికి, వాటిని సాధించటం కోసం పోరాడటానికి తనేం మిగిల్చాడు– అన్నీ – అన్నీ తనే అమర్చిపెట్టి వాడి జీవితాన్ని నిర్వీర్యం నిరర్థకం చేసాక, వాడుతాగక ఏం చేస్తాడు అనుకున్నారు.

మెల్లిగా ముందుకెళ్ళి ఆ సీసాని చేతిలోకి తీసుకుంటూ 'నువ్వూ నిద్ర పోవటానికే తాగుతున్నావా?' అన్నారు.

ఆ ప్రశ్న అతడికి బొత్తిగా అర్థంకాలేదు– తెల్లబోయాడు అతడిని ఇబ్బంది పెట్టటం ఆయనకెందుకో ఇష్టం అన్పించదు. చటుక్కున ఆ సీసాని అలాగేపట్టుకుని వెనుతిరిగి చరచరా తనగదిలో కెళ్ళారు. అపుడు, ఆ సీసాని పరిశీలనగా చూసేరు.

నాయుడు చెప్పిన నిద్రమందు– స్కాచ్ విస్కీ.

ఆయనేదో నిర్ణయానికొచ్చినవాడిలా చకచకా బట్టలు  మార్చుకుని నైట్ గవున్ వేసుకున్నారు. టైము ఏడుగంటలుకావస్తోంది.

అంతలో నౌకరు కాఫీ పట్టుకొచ్చాడు.

'కాఫీవద్దు– రాత్రి భోజనానికి కూడాలేపొద్దు. నాకు నిద్రముంచుకొస్తోంది' అనేసి, అతడెళ్ళిపోయాక, తలుపుగడియపెట్టి. గ్లాసులోనికి సీసాలో ద్రవం కొద్దిగా పోసేరు. ప్రక్కనేవున్న ఫ్రిజ్‌లోంచి సీసాతో నీళ్ళు తెచ్చి నీళ్ళు కలిపారు.

గ్లాసుపైకెత్తి మెల్లిగా గుటకవేసారు.

మంగమంటగా, చేదుగా, వగరుగా, హాయిగా వున్నట్లు అన్పించింది. వెంటనే మరో సిప్.... మళ్ళీ... కొద్దినిముషాల్లో గ్లాసు ఖాళీ అయ్యింది.

జీవితంలో మొదటిసారి త్రాగటం– దీని అవసరంకాని, అవకాశం కాని వస్తుందనుకోలేదు. కాని ఈరోజు నిద్రకోసం... హాయిగా సంతృప్తిగా ఒళ్ళు మరిచి నిద్రపోవాలన్న ఆశతో....

మళ్ళీ గ్లాసుని ద్రవంతో నింపేడు. రెండో రౌండ్ పూర్తయ్యే సరికి నరాలు సళ్ళించినట్లు, బిగదీసిన శరీరం ప్రశాంతమైనట్లు, కొద్దిదిమ్ముగా, ఎంతో హాయిగా ఏదో లోకాల్లో కెదుతున్నట్లు– రాజారావుగారు ప్రక్కమీది కొరిగారు.

మెత్తటి స్పాంజీపరుపు– ఎయిర్‌కూలర్ నించి వస్తున్న చల్లగాలి, కడుపులో చేరిన ద్రవం అన్నీ తనని నిద్రాదేవి వొడిలోకి తీసుకెడుతున్నాయని కళ్ళు మూసుకుని పడుకున్నారు.

పదినిముషాలు కళ్ళుమూసుకునలాగే పడుకున్నారు.

భార్య రావటం, నౌకరుని పిలవటం, నౌకరు చెప్తున్న సమాధానం, అటు తర్వాత, భార్య ఆమె గదిలోకెళ్ళిన శబ్దం, తర్వాత టీ.వీని ఆన్ చేసినట్లు అన్నీ తెలుస్తూనే వున్నాయి.

మెల్లిగా కళ్ళుతెరిచారు. తలతిరగటం కాస్తతగ్గింది. దాంతోపాటుగా ఆనందం, ఆశకూడా తగ్గినాయ్.

అంటే తనకి త్రాగినా నిద్రరావటం లేదు– అని తెల్సిపోయింది. నిముషాలు గడిచినకొద్దీ విస్కీ ప్రభావం తగ్గిపోసాగింది.

భార్యగదిలోంచి టీవీ శబ్దం, కొడుకు గదిలోంచి ఫిల్మ్ సంగీతం రెండూ కల్సి భయంకరంగా విన్పిస్తున్నాయి.

ఆయన మెల్లిగా తలుపుతీసుకుని బయటికొచ్చి భార్య గదిలోకెళ్ళారు. చారుమతి సోఫాలో పడుకొని టీవీలో క్రికెట్ మ్యాచ్

చూస్తోంది.

దగ్గరగావెళ్ళి, "చారూ! రాత్రి నాకు నిద్రపట్టలేదు. ఏవిటోలావుంది, కాస్సేపు నా గదిలో కూర్చుందాం, వస్తావా?' అన్నారు.

ఆవిడా చాలా తేలిగ్గా "అబ్బ, నిద్రరాకపోయినా దిగులేనా? క్రికెట్ మ్యాచ్ చూడాలి ఏవండీ, గవాస్కర్ సెంచరీ కొట్టాడుడీ"

ఆయన మరింకేం మాట్లాడలేదు మళ్ళీ తన గదిలోకెళ్ళిపోయి టేబిలుపై తలవాల్చి కూర్చున్నారు. ఏదో వెలితి–ఇదీ అని చెప్పలేని భావనకల్గింది అప్రయత్నంగా ఆయన కళ్ళు చెమ్మగిల్లినాయ్.

ఆరాత్రి అలాగేగడిపారు. నిద్రమాత్రం రాలేదు. తెల్లవారింది.

ఆయనలాగే పడుకున్నారు. లేవాలన్పించలేదు. ఒళ్ళంతా నీరసంగా, సూదులతో పొడుస్తున్నట్లుగా బాధ. మొహం రెండు రాత్రుల నిద్రలేమివల్ల మరింతగా పీక్కుపోయింది.

అంతలో తలుపుచప్పుడు.

చారుమతి హడావుడిగా లోనికొచ్చింది. భర్తనిచూసి "అయ్యో అలా వున్నారేమిటండీ రాత్రి నిద్రపట్టలేదా? ఏవండీ– రాత్రి మనవాళ్ళు క్రికెట్ ఎలా ఆడారో తెల్సా? అదరగొట్టేశారు– అవును, ఇవాళ కంపెనీకెళ్ళరా?"

రాజారావుగారికి ఆవిడవైపు చూడాలనిగాని, సమాధానం చెప్పాలనిగాని, అన్పించలేదు. అందువల్ల అలాగే సీలింగువంక చూస్తూ పడుకున్నారు.

ఆవిడ చటుక్కున ఆయనవొంటిని తాకి, అయ్యో, కాస్తవెచ్చగాకూడా వుందే అనుకుంటూ బయటకెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఆవిడ కొడుకుతో సంప్రదింపు డాక్టరుకి ఫోన్లు... సత్యప్రసాద్ తండ్రికి బాగోలేదని ఫోన్ చెయ్యగానే నిముషాల్లో వ్రాలాడు డాక్టరు పరమేశ్వరరావు.

రాజారావుగారు జరుగుతున్న తంతుని ఆసక్తిగా గమనిస్తున్నారు..

పరమేశ్వరరావు అన్ని పరీక్షలు చేశాడు. నాడి, కళ్ళు, నోరు, ముక్కు బ్లడ్‌ప్రషర్–సభ్యతగా చూడదగ్గవన్నీ చూసేడు. చూసేక 'అబ్బే ఏంలేదు– కేవలం నిద్రలేకపోవటంతో బడలికగా వున్నారు– అంతే' అన్నాడు అందరి డాక్టర్లలాగానే.

భార్య, కొడుకు, నౌకర్లు చుట్టూ నిలబడున్నారు రాజారావుగారు ఏం మాట్లాడలేదు.

పరమేశ్వరరావు మళ్ళీ నిద్రవచ్చేందుకు మాత్రలు వ్రాశాడు. 'రెండు వేసుకుని పడుకోండి– ఆ తర్వాత ఏమీ వుండదు' అంటూ కాగితాన్ని సత్యప్రసాద్ కిచ్చాడు. ఆ కాగితాన్నందుకుని అతడు బయటికెళ్ళాడు.

పరమేశ్వరరావు తన సరంజామా సర్దుకుంటూ 'హాయిగా రెస్టు తీసుకోండి సాయంత్రం ఫోన్‌చెయ్యండి అవసరమైతే మళ్ళీ వస్తాను' అంటూ నమస్కారాలు చేసుకుంటూ వెళ్ళిపోయాడు ఆయనతోపాటు భార్య, నౌకర్లు అందరూ వెళ్ళిపోయారు.

మళ్ళీ గదిలో రాజారావు ఒంటరిగా

కాస్సేపటికి నౌకరుచేతిలో రెండు మాత్రలు, గ్లాసులో నీళ్ళు తీసుకు వచ్చాడు 'బాబుగారు మందుబిళ్ళలండి'

రాజారావుగారు అటువైపుగా చూసేరు– ఆ చూపులో ఏదోలోటు, అసంతృప్తి, ఆందోళన కన్పించాయ్.

"అమ్మగారేరి?" ఆయన ప్రశ్న.

"ఫోనొచ్చిందండి– అర్జెంటుగా వెళ్ళాలని, మీకు మందిమ్మనిచెప్పి కార్లో వెళ్ళిపోయారండి. అబ్బాయిగారు, చిన్నమ్మగారు కూడా ఏడకో ఎళ్ళారండి" అన్నాడు భయంగా నౌకరు.

రాజారావుగారు ఫోమ్‌బెడ్‌లోంచి లేకి కూర్చుని, వాడందిస్తూన్న మాత్రలు అందుకుంటూ, "ఈమాత్రలు బజారునుంచి ఎవరుతెచ్చారు?" అనడిగారు.

"సింగు– కార్లోవెళ్ళి తెచ్చాడండి"

రాజారావుగారికి ఆ క్షణంలో అసహ్యం అన్పించింది. తనొక యంత్రం లాంటివాడు. చల్లగాలికోసం కూలర్, టి.వి. రేడియో, మిక్సర్ వగైరాల్లా డబ్బు సంపాదించే యంత్రం తను ఈ ఇంట్లో తన స్థానం అది! ఆక్షణంలో ఆ మాత్రలు నిద్రకోసంకాక, ప్రాణం పోవటానికని ఎవరన్నా చెప్పినా, వెనుకాడక, ఆనందంగా మరో రెండు మాత్రలు కలిపిమరీ మింగేవారు.

అసహ్యంతో, కోపంతో, విరక్తితో, రెండు మాత్రలు నోట్లోపడేసుకుని గుక్కెడు నీళ్ళుమింగారు. ఈదెబ్బతో నిద్రరావాలి. వచ్చితీరాలి. రెండురాత్రులుగా తనకి దూరమయిన, తన దృష్టిలో అపురూపత్వాన్ని సంతరించుకున్న నిద్ర వచ్చి, దయతో, అర్ద్రతతో, కరుణతో, తనని ఒడిలోకి తీసుకొని లాలించాలి. నిర్వీర్యం అయిన తన మనస్సు హాయిగా, తృప్తిగా, సుషుప్తిగా సేద తీర్చుకోవాలి.

రాజారావుగారు ఆలోచిస్తూ కళ్ళు మూసుకుపడుకున్నారు. అయిదు.... పది... పదిహేను నిమిషాలు గడిచాయ్. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

కూలర్‌నించి వస్తున్న గాలి వెచ్చగా వుంది. రాజారావుగారు చటుక్కున లేచి కూలర్ ఆఫ్‌చేశారు. మళ్ళీ మంచంపై వ్రాలబోతూ, ఒక్కక్షణం ఆలోచించారు. తనకి నిద్రవచ్చే సూచనలు మచ్చుకైనా అన్పించలేదు. తలదిమ్ము, ఆవులింతలు, కళ్ళుమూసుకుపోవటంలాంటివి ఏమీలేవు. అంటే నిద్రమాత్రలు పేరు నిలబెట్టుకోలేక పోయినాయ్... రాజారావుగారు గదిలోంచి బయటికొచ్చారు.

భార్య గదిలోకి, తర్వాత కొడుకు గదిలోకి తొంగిచూసేరు. అంతా నిశ్శబ్దం. శూన్యం. తన కృత్రిమ జీవితంలోని కుటిలత్వం కొట్టొచ్చినట్టుగా కన్పించింది. జీవితపురహదారిలో నడిచినడిచి గమ్యం చేరినట్లు– వెనక్కితిరిగి చూసుకుంటే ఎవరూ– భార్య, కొడుకు, కోడలు,నౌకర్లు, లక్షలు, కోట్లు, వ్యాపారాలు, అయిదంతస్థుల భవనాలు, పడవకార్లు ఏవీలేనట్లు, తనొక్కడే నిత్యము సత్యము ఆయినట్లు భావన.

మెట్లుదిగి క్రిందికొచ్చారు. ఒకప్రక్క నౌకరు, వంటవాడు గుసగుస.కాళ్ళకి చెప్పులు గూడా లేవు. ఎండ చుర్రుచుర్రలాడుతోంది. అలాగే నడక ప్రారంభించారు.

ఎక్కడికో తేలీదు ఎందుకో తెలీదు. నిద్రలో నడుస్తున్నవాడిలా, నిశ్చలమైనచూపులతో నడుస్తున్నారు. కాలిలో ఏదైనా గుచ్చుకున్నపుడు ఒక్కక్షణం మొహంచిట్లించి మళ్ళీ నడుస్తున్నారు.

...అలా ఎంతసేపు నడిచారో ఆయనకే తెలీదు సూర్యుడు నడినెత్తి పైకొచ్చాడు. కాళ్ళలో శక్తిహరించింది. నీరసం శరీరమంతా ఆవహించింది. అలసటతో చెమటలు దిగ్గారుతున్నాయి.

రాజారావుగారు ఆగారు. ఆగారుకనుక చుట్టూ చూసేరు. పచ్చటి పొలాలు, పొలంగట్లపైన పశువుల మందల గుంపులు. గుంపులుగా పొలాల్లోపన్చేసుకునే పడుచులు, వాళ్ళనదిలిస్తున్న మొగాళ్ళు కడుపునింపుకోవటానికి వాళ్ళు ఒళ్ళు వొంచి పన్చేస్తున్న తీరు. మరోవైపుకి దృష్టిని సారించారు.

విశాలమైన స్థలం– దాంట్లో చిన్నగుడిసె. దానికి దూరంగా పశువుల కోసం కట్టిన కొట్టం– గడ్డివాములు– కోడిపిల్లల కిచకిచలు– పల్లెటూరి వాసన...

రాజారావుగారు పశువులకొట్టం వైపుగా నడిచేరు.

అందులో ఒక ప్రక్క కుక్కినులక మంచం, దాంట్లో నల్లగా అసహ్యంగా వున్నదిండులాంటి వస్తువు.

అలసటతో విలవిలలాడుతున్న శరీరం అప్రయత్నంగా మంచంలో పడింది. ఆయన బరువుకి మంచం కీచుమంది.

అంతలో విన్పించాయ్ మాటలు– ఎదురుగా పాకలోంచి వినిపిస్తున్నాయి . ఎవరో ఆడమనిషి అంటుంది.

'మావా– ఇదంతా నావల్లేకదూ, నేనడక్కుండా వుంటే నువు చింతచెట్టు ఎక్కేవాడివికాదు అక్కడినుంచి...' వెక్కిళ్ళు మిగతామాటలనిమింగేసినాయ్ అంతలో మగగొంతు చాలా కోపంగా, కర్కశంగా అంటున్నది. 'నీ యవ్వ– ఇపుడు నాకేమైందే– నిచ్చేపంలాగున్నాను. కూసింత గీరుకుపోయినాది అంతే గందా 'ఎల్లెయ్యి బువ్వతిను' అది వెంకడిగొంతు– రాజారావుగారింట్లో పాలు పోసే వెంకడుగొంతు మంచంలో కూర్చున్న ఆయన ఆసక్తిగా వినసాగాడు.

'నాకొద్దయా– నీకిలావుంటే నే బువ్వతింటానా? సయిస్తదా? మావా నా వొల్లోపడుకో! ఇలారా... ' ఏడుస్తోంది ఆమె.

నీతో మాసెడ్డ కష్టమే... నీయవ్వ'

తర్వాత మాటలు విన్పించలేదు. వెక్కిళ్ళు, గాజులరవళి, చల్లగాలిసందడి తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది.

రాజారావు మంచంలోకి ఒరిగాడు కళ్ళుమూసుకుని ఆలోచిస్తున్నాడు.

పాకలో ఆమె, ఆమె వడిలో అతడు, అతడి వొంటికి వరంలాంటి గాయం అందుకై ఆమె గుండెల్లో వేదన, కళ్ళలో నీళ్ళు ఆప్యాయంగా అతనిజుట్టులోకి పోయినవేళ్ళు... తదాత్మ్యం చెందుతున్న రెండు మనసులూ–

ఆలోచిస్తున్న రాజారావుగారు, మునుపులేని హాయి, సంతోషం, జీవితపు విలువలు తెలుసుకున్న ఋషిలా, మనిషి ఎరఁకోసం బ్రతకాల్లో, ఎందుకోసం చావాలో, తెల్సిన జ్ఞానిలా, విలువలుకట్టే షరాబులా వున్నాడు.

కొద్ది నిమిషాల తర్వాత– ఆమె పాకలోంచి బయటకిరావటంగాని, కెవ్వున అరవటంగాని, వెంకడు బయటకొచ్చి అయ్యగార్ని చూసి బుగ్గలునొక్కుకోవటంగాని రాజారావుగార్కి తెలీదు.

కారణం– ఆయన అప్పటికే నిద్రపోయారు.